**కథ**

# రెండు పసుపు కొమ్ములు

**ముత్యాలు మౌనంగా సర్పంచ్ చెప్పే మాటలు వింటోంది.**

**"ముత్యాలూ.. నేను పట్నంలో నిన్న నీ పెనిమిటి రాజయ్యను చూశాను. డాక్టరుగారు హాస్పిటల్ కడుతున్నారు గదా! వారి దగ్గర మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పసుపు పంట దిగుబడి బాగా వచ్చింది కదా! విత్తనానికి కాసిని కొమ్ములుంచి మిగిలింది అమ్మేసి బాంక్ లోను తీర్చేయమని చెప్పాడు. మళ్లీ రేటు పడిపోతే కష్టం కదా! నువ్వు అమ్ముతానంటే నేనే తీసుకొంటా. మార్కెట్ కంటే పది రూపాయలు ఎక్కువే ఇస్తాలే. ఏంవంటావ్!"**

**ముత్యాలు ఏమీ మాట్లాడలేదు.**

"నా మాట మీద నమ్మకం లేకపోతే ఇదుగో నా గుమస్తా వెంకట్రావు కూడా విన్నాడు. చెప్పరా వెంకట్రావ్. నిన్న రాజయ్య ఏం చెప్పాడో నాతో..."

ముత్యాలు "నమ్మకం లేక కాదయ్యగోరూ! అంత పని నేనొక్కదాన్ని చెయ్యగలనా! కాటా ఎయ్యాలి, గోనెల్లో పట్టాలి, లెక్క డొక్కా చూసుకోవాలి..." ఇంకా ఏదో అంటోంది.

"ముత్యాలూ - నువ్వు 'ఊ' అను. అంతా నేను చూస్తా. బాంకు మేనేజరు గారూ ఉన్నారు. నీకేం నష్టం రానివ్వం. అప్పు తీరిపోతుంది. మళ్లీ వర్షాలు పడిన వెంటనే కొత్త పంటకు బాంకు నిన్ను ఆదుకుంటుంది. మన ఆచారి కూడా ఇక్కడే ఉన్నాడు కదా! ఇప్పుడు క్వింటాలు రెండు వేల నాలుగొందలు రేటుంది. నీకు రెండు వేల ఐదొందలు లెక్క చొప్పున ఇస్తా. ఈ సరుకంతా నువ్వు మార్కెట్‌కు ఎక్కడ తీసుకెళ్లగలవు? నా మాట విను. నాకూ రెండు రూపాయలు మిగులుతాయి. నీ పంటకూ మంచి రేటు, మేనేజరు బాబుకి మంచి పేరొస్తాది. బాంకులో బాకీ తీరుతుంది. రాజయ్యకు మాట పోదు ఆలోచించుకో" సర్పంచ్ గట్టిగా రెట్టించాడు.

ముత్యాలుకి కూడా బాగానే అనిపించింది సర్పంచ్ సలహా.

"మీ ఇష్టం బాబూ"

"సరే. అల్లా అవుతే కాటా, గోనె సంచులూ సరంజామా అంతా తీసుకొని డబ్బట్టుకొని నేను, బాంకు మేనేజరూ ఒక గంటలో వస్తాం. అమ్మకం అయిన తరువాత నీ డబ్బు నేను నీకిచ్చేస్తా. నువ్వు బాబుగారికి అప్పు - పంటది. తీర్చెసెయ్యి. ఆయనగారు కూడా వడ్డీ లెక్కలు కట్టుకొని వస్తారు. అందరికీ వీలుగా పని జరుగుతుంది" సర్పంచ్ స్టూల్ మీద నుంచి లేచి కండువా గట్టిగా దులిపి ఇంటివైపు నడిచాడు.

* * *

ముత్యాలు అరుగుమీద కుప్పగా పోసిన పసుపుకొమ్ముల వంక చూసింది. "కొమ్ములు పొడవుగా, లావుగా, నునుపుదేలి గట్టిగా ఉన్నాయి. దుగ్గిరాల వెరైటీ. తొమ్మిది మాసాల కష్టం. రాజయ్య పట్నంలో పనికి వెళ్లిపోతే తానే స్వయంగా దుక్కిదున్ని, విత్తు నాటి, నీరుపెట్టి, కలుపుతీసి, ఎరువేసి కంటికి రెప్పలా చూసుకొని పండించింది. యూరియా అసలు వేయకుండా గెత్తం వేసి పండించింది. బండి మీద గెత్తంను తనే పొలానికి తోలింది కూడాను. పసుపుదుంపలు, కొమ్ములు దెబ్బ తినకుండా చాలా జాగ్రత్తగా తీయించింది. కూలీలతో దెబ్బలాడింది కూడాను వాళ్లు సరిగ్గా పనిచెయ్యకపోతే. పచ్చిపసుపు కొమ్ములను తానే దగ్గరుండి 'క్యూరింగ్' చేయించింది. జల్లెడ పట్టించింది. నీళ్లలో ఉడకబెట్టి, ఎండబెట్టింది పదిహేను రోజుల పాటు. ఎనిమిది, పదివేల కేజీలు తూగాలి ఎకరా పంట. ఎంతొస్తుందో' కొమ్ములను ప్రేమతో చూసింది. కొమ్ములు బంగారు రంగులో మెరుస్తున్నాయి. గుప్పెడు కొమ్ములు చేతుల్లోకి తీసుకొని వాసన చూసింది. "బంగారు కణికెలు నా పంట" గర్వంగా ముత్యాలు మొహం చేటంత అయింది.

"మంచి సువాసన.. పసుపు వాసన" గట్టిగా ఒక్కసారి గుండె నిండేటట్టుగా పీల్చింది ముత్యాలు. ముత్యాలుకి ఆ వాసన ఎంతో హాయినిచ్చింది. భోజనానికి కూడా ఇంట్లోకి వెళ్లకుండా పసుపుకొమ్ముల రాశి పక్కనే కూర్చుండి పోయింది.

* * *

ముత్యాలుకి ఇరవై ఏడేళ్లుంటాయి. చక్కగా పొందికగా ఉంటుంది. శరీరఛాయ నేరేడు పండు రంగు. నల్లగా మిలమిలలాడుతూ చక్కటి కనుముక్కు తీరుతో ఆకర్షణీయంగా ఉంటుంది. పైగా మాట పొందిక, చేతల్లో చురుకూ, మొహంలో అమాయకత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. అందరి చేత మంచి అనిపించుకుంటోంది. రాజయ్యను తానే ఏరికోరి పెళ్లి చేసుకుంది. "భూమా, పుట్రా, నగానట్రా, ఏమున్నాయ్ అతని దగ్గర? ఒడ్డు పొడుగూ ఉంటే చాలేంటే. ఒక ఎకరాపొలం, పూరిల్లూ. బాగా ఆలోచించుకో" అని తల్లీ తండ్రీ అందరూ చెప్పారు. అయినా ముత్యాలు వింటేగా.


"నేను ఎనిమిది వరకూ చదువుకొన్నా. రాజయ్య పది చదివాడు. నాకు చిన్నప్పట్నించీ ఎరికే. మంచోడు. మా మనసులు కలిశాయ్" అని నిక్కచ్చిగా చెప్పింది. అలాగే రాజయ్యనే పెళ్లిచేసుకొంది. తన ప్రాణం కంటే ఎక్కువగా చూసుకొంటోంది పెళ్లయిన రోజు నుంచి.

* * *

గత రెండేళ్లుగా పంటలు సరిగ్గా పండడం లేదు. వర్షాలు లేవు. కరవే కరవు. ఉన్నది ఎకరా పొలం. నీటి వసతి ఉన్నా కష్టంగా ఉంది సాగుచెయ్యడం. రెండు సంవత్సరాలు మిర్చి వేశాడు రాజయ్య. మొదటి సంవత్సరం ఆ ఏడాది క్వింటాలుకి ధర రెండు వేలకి పడిపోయింది. పైగా ఖర్చులేం తగ్గలేదు. గిట్టుబాటు ధర రెండువేల ఏడు వందలుంటే అది కిట్టడం దూరపుకొండల సామెత అయింది. వచ్చిన రేటుకి అమ్మి కళ్లనీళ్లు పెట్టుకొని మార్కెట్ యార్డు నుంచి వచ్చిన రాజయ్య భుజంమీద చెయ్యివేసి ధైర్యం చెప్పింది ముత్యాలు. గుండె దిటవుపరచుకొని రాజయ్య మళ్లీ దుక్కి పట్టాడు. సీజన్‌లో ఆలస్యంగా కురిశాయి తొలకరి జల్లులు. రాజయ్య నిరాశపడలేదు. ముత్యాలు పక్కనుంటే రాజయ్యకు ఎక్కడి లేని ధైర్యం, బలం వస్తాయి. వరిపంట వేశాడు. కాలువలో నీళ్లే రాలేదు. శ్రమ మాత్రం మిగిలింది. ఆకాశం నుంచి వర్షపు బొట్టు కూడా పడలేదు. చెమటోడ్చి ఊడ్చిన వరిచేను ఎండిపోతుంటే కన్నీరు మున్నీరుగా విలపించాడు రాజయ్య ముత్యాలు చూడకుండా.

* * *

శాంతి ప్రభాకర్



వరం

సగా రెండు సంవత్సరాలు భూమిపై ఆదాయం లేదు. పైగా బాంకులో తీర్చవలసిన బాకీ ఇరవై వేలు అలాగే ఉండిపోయింది. రాజయ్య డీలాపడిపోయాడు. ముత్యాలుకి భయం వేసింది.

"ఏమైనా అగాయిత్యం చేస్తాడేమో! కొంతమంది రైతులు పురుగు మందులు తాగో, ఉరేసుకొనో" ముత్యాలు భయంతో వణికిపోయింది.

* * *

పది నెలల క్రితం రాజయ్య, ముత్యాలు గట్టుమీద కూర్చున్నారు.

"ముత్యం! నువ్వు సేద్యం చూసుకోగలవా !" రాజయ్య నెమ్మదిగా అడిగాడు.

"అదేంటయ్యా! నేనూ రైతుబిడ్డనే కదా!"

"అల్లా అవుతే నువ్వు వ్యవసాయం చూసుకో. ఇక్కడ ఉండి. నేను పట్నం వెళ్లి ఏదైనా పని...."

ముత్యాలు గుండె ఆగిపోయింది. భయం భయంగా రాజయ్యను చూసింది.

"ఏం భయంలేదు ముత్యాలు. నేను పట్నం వెళ్లి కూలోనాలో చేసి నాలుగు డబ్బులు తెస్తా. నువ్వు వ్యవసాయం చూసుకో. ఒక సంవత్సరంలో మన బాకీలు తీరిపోతాయి. కష్టాలు ఎల్లకాలం ఉంటాయేంటి?" రాజయ్య ముత్యాలు చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఒక వారం రోజులు గడిచాయి. రాజయ్య విజయవాడ వెళ్లిపోయాడు చిన్న చేతి సంచితో.

* * *

ముత్యాలుకి గతమంతా గుర్తుకు వచ్చింది. రాజయ్య నెలకోసారి వస్తున్నాడు. ఎంతో కొంత డబ్బిచ్చి వెళ్తున్నాడు. పట్నంలో డాక్టరుగారు హాస్టల్ కడుతున్నారు. అక్కడ మేస్త్రీగా కుదిరాడు. నెలకు నాలుగు వేల రూపాయల జీతం మీద. తాను పొలంలో పసుపేసింది. కంటికి రెప్పలా కాపుకాసి పండించింది. పొలం తనకాపెట్టి ఇంకొంత అప్పుచేసింది. మొత్తం అప్పు పాతిక వేలయింది. పసుపు బాగా అయ్యింది కదా! అప్పు తీర్చేయ్యొచ్చు. మనసులోనే ధైర్యం చెప్పుకొంది ముత్యాలు.

* * *

సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలైంది. సర్పంచ్, బాంకు మేనేజరు, ఫీల్డ్ ఆఫీసరు, ఆచారి ఇంకా ఇద్దరు ముగ్గురు రైతులు వచ్చేశారు.

"ఏం ముత్యాలు..."

"మీ ఇష్టం బాబూ"

సర్పంచ్ కూలీవాళ్లకి సైగ చేశాడు. కాటా నిలబెట్టారు. తూకం రాళ్లు, పసుపుకొమ్ములు పోటీపడ్డాయి. తూచిన కొమ్ములు బస్తాల్లోకి ఎక్కిస్తున్నారు కూలీలు గబగబా.

నాలుగైంది. తూకం, లెక్కలు పూర్తయ్యాయి. "ఆరుగాలం కష్టం. ఏం మిగులుతుందో?" ముత్యాలు తనలోనే అనుకుంది.

"ముత్యాలూ... లెక్క కట్టాం. నీ పసుపుకు పాతిక వేలొచ్చింది. ఇంకో వెయ్యి నేనిస్తా. మొత్తం ఇరవై ఆరు వేలు. నీకు విత్తనం కొమ్ములు ఉంచేశా. అవిగో చూసుకో సరేనా! ఈ పెద్ద బుట్టలో వేయించాను."

ముత్యాలుకి ఒక్కసారి గుండె ఆగిపోయినట్టయింది. "ఇరవై ఆరు వేలు జమేయంగా ఇంకా ఎంత బాకీ ఉంటుంది బాబూ"

"ఇంకా నాలుగు వేలు ఉంటుంది" ఫీల్డ్ ఆఫీసరు లెక్క చూసుకొని చెప్పాడు.

"మరి అది ఎల్లాగా" ముత్యాలు ఏదో అడగబోతోంది.

"ఒక పని చెయ్యి ముత్యాలూ. నీ దగ్గరేదైనా బంగారం ఉంటే కుదువపెట్టు. ఒక నాలుగు వేలొస్తే చాలు. నీ బాకీ పూర్తిగా తీరిపోతుంది" ఆచారి నెమ్మదిగా అన్నాడు. ముత్యాలు ఏమైనా అంటుందేమో

కోపంతో భయపడుతూ తలవంచుకున్నాడు.

ముత్యాలు నవ్వుతూ "నా దగ్గరేముంది అన్నా! తాళిబొట్టు తప్ప. మీ బావ కూడా ఇక్కడ లేరు కదా!" అంది.

సర్పంచ్ కొద్ది ధైర్యం తెచ్చుకున్న స్వరంతో "ముత్యం! రాజయ్య లేకపోతేయేం. బాకీ తీరిపోతుం దిగా పూర్తిగా. ఈసారి పంట లోను ఇచ్చినపుడు బంగారం విడిపించేసుకోవచ్చు గదా! మేం అందరం అల్లాగే చేస్తాం కదా! బాంకులో నీ లావాదేవీలు చక్కగా ఉంటాయి కదా! ఆలోచించుకో!"

ముత్యాలు సర్పంచ్ మొహంలోకి సూటిగా చూసింది.

"వద్దు బాబూ. మీకు ఆ కష్టాలు రాకూడదు. భగవంతుడి దయవలన మీ భార్యగారి తాళిబొట్టు బయటకు తీసే అవసరం రాకూడదు బాబూ" ఆమె కంఠం బొంగురుపోయింది.

సర్పంచ్‌తో సహా అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. వాళ్ల తలలు నేలకు దిగిపోయాయి, అవమాన భారంతో.

"అయినా రాజయ్య లేకపోవడం ఏంటి బాబూ ఊర్లో మనతో లేడు అంతే. పట్నంలో ఉన్నాడు కదా!"

సర్పంచ్ తాను అన్న మాటలు గుర్తుచేసుకొని తత్తరపడ్డాడు.

ముత్యాలు ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఇంట్లోకి వెళ్లిపోయింది.

అందరికీ భయంగా ఉంది. అందరి మొహాల లోనూ ఆందోళన.

ఐదు నిమిషాలు గడిచాయి. ముత్యాలు బయటకు వచ్చింది.

"ఆచారన్నా! ఇందా తీసుకో! ఇవి నువ్వే చేశావు. నిఖార్సైన బంగారం. పదిహేను గ్రాములు. బాంకులో పెట్టించి మీ బావ అప్పు పూర్తిగా తీర్చేసై." సూత్రాలు తిన్నెమీద పెట్టింది.

అందరూ ఆశ్చర్యపోయారు. ముత్యాలు వంక చూశారు. ఆమె మెడలో పసుపుతాడు, దానికి రెండు పసుపు కొమ్ములు. పశ్చిమ దిక్కున అస్తమిస్తున్న సూర్యుడి కాంతి కిరణాలు వాటి పసుపు రంగును వెయ్యిరెట్లు అధికం చేశాయి. పసుపు తాడు, పసుపుకొమ్ములు పసిడిరంగులో మెరుస్తున్నాయ్.

ఆచారి ముందరకు రాలేదు.

"అన్నా! తీసుకో అన్నా. నా మెడలో ఉంటే అవి మంగళసూత్రాలు కానీ బయటకు వస్తే అవి ఉత్త బంగారమే కదా! ఆ కనకదుర్గ దయ ఉన్నంత కాలం నా మాంగల్యానికి ఏం భయం లేదు. ఆ దేవి దయ వల్ల ఈ రెండు పసుపుకొమ్ములే నాకు పసిడికొమ్ముల వుతాయి. నేను మీ బావకు చెప్పుకుంటాను గదా! పైగా అప్పు పూర్తిగా తీరిపోయినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీ బావ నాకు అప్పజెప్పిన బాధ్యత అదే కదా!"

సర్పంచ్ సైగ చేశాడు. ఆచారి ముందరకి వచ్చి అరుగుమీద ఉన్న సూత్రాలు తీసుకున్నాడు.

ఫీల్డ్ ఆఫీసరు వెంటనే డబ్బు పూర్తిగా ముట్టినట్లు సంతకం చేసి రశీదు ముత్యాలు చేతిలో పెట్టాడు.

ముత్యాలు గట్టిగా నిట్టూర్చి "అమ్మయ్య!" అంది.

ఇంతలో సర్పంచ్ "వెంకట్రావ్! ముత్యాలుకి నిన్న నువ్వు ఆ విషయం చెప్పావా?" వెంకట్రావ్ వైపు చూస్తూ అడిగాడు.

"లేదండీ"

"అదేంటి? ఇంతవరకూ చెప్పకపోవడం ఏంటి? నీకు బుద్ధి లేదా!"

"సంగతి ఏంటి సర్పంచ్‌గారూ, ఇప్పుడు చెప్పండి" ముత్యాలు స్వరంలో ఆందోళన.

"నిన్న ఉదయం మాతో మాట్లాడిన తరువాత రాజయ్య నిచ్చెన మీద నుంచి పడిపోయాడు. ఆ విషయం నీకు చెప్పమని వెంకట్రావుకి చెప్పాను. వీడు నీతో ఇంతవరకూ చెప్పలేదు. ఎంత పొరపాటు. రక్తం బాగా పోయింది. ప్రాణాపాయం లేదనుకో! డాక్టరుగారు తన హాస్పిటల్లో ఉంచి స్వయంగా వైద్యం చేస్తున్నారు" ఒక గుక్కలో చెప్పాడు సర్పంచ్. తన బాధ్యత తీరిపోయినట్లు గట్టిగా గాలిపీల్చుకున్నాడు.

ముత్యాలు నిశ్చేష్టురాలైంది. ఆమె కళ్లముందర కటిక చీకటి కమ్మివేసింది. అలాగే నేలమీద కూర్చుండిపోయింది. ఆమె కళ్ల నుండి అశ్రువులు ధారా ప్రవాహంగా స్రవిస్తున్నాయి.

ఐదు నిమిషాలు గడిచాయి. ముత్యాలు కొద్దిగా తేరుకొంది. "ఇంత మంది పెద్దలు నిజాన్ని దాచి తమ తమ పనులు చక్కపెట్టుకున్నారు. బ్యాంకు వారు బాకీ వసూలు చేసుకున్నారు. సర్పంచ్ పరపతి పెంచుకున్నాడు. పసుపు ఏజెంటు తన కమిషన్ సంపాదించుకున్నాడు. కాటావేసిన కూలీలు తమ కూలిడబ్బులు గడించారు. ఆచారికి బంగారం తూకం వేసినందుకు చార్జీలు అందుతాయి. మరి తనకు? ప్రపంచం ఇల్లాగే ఉంటుందా" లోలోనే అనుకుంది. 'ప్రకృతి తన మీద దయ చూపించింది. పంట పండింది. కానీ మనుష్యులు.. సాటివాళ్లు..'

"ఫరవాలేదు బాబూ. వెంకట్రావుగారినేం అనకండి. కనకదుర్గమ్మ దయ వల్ల నా రాజయ్యకేం గాదు. నేను బయలుదేరి ఇప్పుడే వెళ్తాను. నా భర్తను అప్పు బాధ నుండి విడిపించాను. అది అతనికి కొండంత ధైర్యం ఇస్తుంది" చీర చెంగుతో కన్నీరు తుడుచుకొని మెడలోని పసుపుకొమ్ములను కళ్లకు అద్దుకొంది ముత్యాలు.

★ ★ ★

సాయంకాలం ఆరు గంటలైంది. విజయవాడ వెళ్లే ఆఖరి బస్సు చింతచెట్టు దగ్గర ఆగి ఉంది. ముత్యాలు బస్సు దగ్గర నిలబడింది. ఆమె నుదుటున తీర్చిదిద్దిన ఎర్రని కుంకుమబొట్టు. దానిమీద సాయం సంధ్యా సూర్యుడి బంగారు కిరణాలు పడి మరింత కాంతివంతం చేస్తున్నాయి. మెడలోని తన మంగళసూత్రాన్ని జాగ్రత్తగా నిండైన తన చీర చెంగుతో గట్టిగా పట్టకొంది ముత్యాలు. విత్తనం కొమ్ములు వేసిన బుట్టను తన పక్కన పెట్టుకుంది.

బస్సు కదిలే సమయం సమీపించింది. ముత్యాలు ప్రాణాపాయంలో ఉన్న తన భర్త దగ్గరికి వెళ్తోందని, ఆమె భర్తను పూర్తిగా ఋణవిముక్తుడిని చేసి కట్టుబట్టలతో, రెండు పసుపుకొమ్ముల మంగళసూత్రంతో ఊరు విడిచి వలసపోతోందని తెలుసుకున్న జనం- పిల్లలూ, పెద్దలూ, ఆడా, మగా అందరూ పరుగెత్తుకొని వచ్చేశారు. వాతావరణం అంతా గంభీరమైన ప్రశాంతత అలుముకొని ఉంది. కానీ ముత్యాలు అమాయక వదనంలో ధైర్యం, ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఆ సుకుమార వదనం కల్మష రహితంగా ప్రకాశిస్తోంది.

ముత్యాలు తన చేతిలోని బుట్టలో నుంచి గుప్పెడు గుప్పెడు పసుపు కొమ్ములు తీసుకొని అక్కడ నిలబడి ఉన్న ఆడవాళ్లకు ఒక్కొక్కరికీ ఇచ్చి రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది.

"అమ్మలూ - అక్కలూ - నా మాంగల్యం నిలబడాలని నన్ను ఆశీర్వదించండి" ఆమె కంఠం గద్గదపోయింది.

ముత్యాలు బస్సు ఎక్కింది. తన రెండు చేతులూ పైకెత్తి అందరికీ మరొక్కమారు వందనం చేసింది. ఆకాశం లోంచి చీకటి తెరలు భూమిని క్రమంగా కప్పేస్తున్నాయి. బస్సు కనుమరుగవుతోంది. చీకటిని చీల్చుకొని ముందరకు పరుగెడుతోంది.

ఊరి జనం అందరూ బరువెక్కిన హృదయాలతో నిశ్చేష్టులై నిలబడిపోయారు.

